

హైదరాబాద్ వార్త

# ఊపిరాడడం లేదు

## నిబంధనలకు నీళ్లొదిలిన పరిశ్రమలు • కాలుష్యంతోనే సహజీవనం చేస్తున్న ప్రజలు



హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త : నిబంధనలు పాటించని పరిశ్రమల నుంచి వస్తున్న ఘాటైన వాసనలతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హైదరాబాద్‌లోని పారిశ్రామిక ప్రాంతాల్లో 17 అత్యంత కాలుష్యకారక కేటగిరీలకు చెందిన పరిశ్రమలున్నాయి. ముఖ్యంగా జీడిమెట్ల, బాలానగర్ పరిశ్రమల ప్రభావం పరిసర ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వీటి రసాయన వ్యర్థాలతో సహజనీటి వసతులు అత్యంత కాలుష్యంగా మారుతున్నాయి. భూగర్భ జలాల్లోని నీరు సైతం రంగు మారుతోంది. ఇది అత్యంత ప్రమాదకరమని ఇప్పటికి నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. మరోవైపు వాయు కాలుష్యం కూడా పెరుగుతుండటంతో గాలి నాణ్యత తగ్గుతోంది. హైదరాబాద్ మొత్తంలో ఎక్కువ వాయు కాలుష్యం కలిగిన ప్రాంతాలుగా బాలానగర్, జీడిమెట్ల ఉన్నాయి. బాలానగర్‌లో గరిష్ట ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 169గా ఉండగా, జీడిమెట్లలో 148గా ఉంది. ఏక్యూఐ 100 దాటితే శ్వాసకోశ వ్యాధులు, అస్తమా లాంటి సమస్యలూ పెరుగుతాయి. ప్రభుత్వం ఈ పరిశ్రమల పట్ల ఇలాగే వ్యవహరిస్తే కాలుష్యం మరింతగా పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పారిశ్రామిక ప్రాంతమైన జీడిమెట్లలో జల, వాయు కాలుష్యం పెరుగుతోంది. ఇక్కడి కాలుష్య కారక పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలి. వివిధ ప్రభుత్వ సంస్థల అధ్యయన నివేదిక సారాంశమిది. సమస్య తీవ్రత దృష్ట్యా స్పందించిన ప్రభుత్వం వెయ్యికి పైగా ఉన్న అత్యంత కాలుష్యకారక పరిశ్రమలను ఔటర్ రింగ్‌రోడ్డు వెలుపలికి తరలిస్తామని జనవరి 2017లో ప్రకటించింది. మరోవైపు కాలుష్యం మాత్రం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. పరిశ్రమలను రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్ నాలుగు విభాగాల్లో వర్గీకరిస్తారు. ఇందులో రెడ్ కేటగిరీ పరిశ్రమలు అత్యంత కాలుష్యకారకం కాగా తర్వాతి స్థానాల్లో ఆరెంజ్ కేటగిరీ ఉంది. ఈ రెండు విభాగాల్లో పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేముందు ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ పరిశ్రమల ద్వారా వెలువడే జల కాలుష్యం ప్రభావం భూగర్భ జలాలపైనా ఉంటుంది. ఇలాంటి పరిశ్రమల్లో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ) లాంటి వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్న నిబంధనలున్నాయి. గతంలోనే ఏర్పాటైన ఇలాంటి పరిశ్రమలు సైతం నిర్దిష్ట కాలపరిమితిలోపు జెడ్ఎల్‌డీ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే జీడిమెట్ల, బాలానగర్, ఎద్దుమైలారం, బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతాల్లో రెడ్, ఆరెంజ్ కేటగిరీ పరిధిలోని అత్యంత కాలుష్య కారక పరిశ్రమలు ఉన్నాయని గతంలో కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది. ఇందులో కొన్ని పరిశ్రమలు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపల ఉండగా, మరికొన్ని నగరంలోనే ఉన్నాయి. వీటిని ఓఆర్ఆర్ వెలుపలికి తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి కాలుష్య స్థాయి పెరుగుతూనే ఉంటుండగా... తరలింపు ప్రక్రియ మాత్రం అంతగా ముందుకు పడలేదు. 1160 పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించడంతో పాటు అక్కడ కాలుష్యం వెదజల్లకుండా జెడ్ఎల్‌డీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని పరిశ్రమల మంత్రి కెటిఆర్ గతంలోప్రకటించారు. వీటి తరలింపునకు మెదక్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 19 ప్రాంతాల్లో 3104 ఎకరాలను కూడా గుర్తించారు. కాలుష్య కారక పరిశ్రమల్లో ఎక్కువశాతం ఫార్మా రంగానికి చెందినవే ఉన్నాయి. వీటిని హైదరాబాద్ ఫార్మాసిటీలోకి పంపుతామని ప్రభుత్వం పేర్కొంటున్నా కంపెనీలు మాత్రం ఆసక్తి చూపించడం లేదు. ప్లాంట్‌లోని యంత్రాలను మరోచోటికి మార్చడం ఏమాత్రం వీలుకాదని, కొత్త చోటికి మార్చితే యంత్రాలన్నీ కొత్తగా తీసుకోవాల్సి ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త ప్లాంట్ పెట్టలేమని ఫార్మా కంపెనీలు స్పష్టం చేస్తున్నారు.

జెడ్ఎల్‌డీ వ్యవస్థ ఏర్పాటుచేయని పరిశ్రమలను తరలించాల్సి ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటుంది. కొన్ని పరిశ్రమలు అప్పటికే అనుమతులు తీసుకొని ఉండటం, కొన్ని కంపెనీలు గడువు కోవడంతో ఈ వ్యవహారం జాప్యమవుతోంది. 1160లో కాలుష్యం ఎక్కువగా విడుదల చేసే ఫార్మా పరిశ్రమలతో పాటు పొగాకు ఉత్పత్తులు, రసాయనాలు, రబ్బర్, ప్లాస్టిక్, మెటల్ ఫ్రాబ్రికేషన్, లెదర్ లాంటి పరిశ్రమలున్నాయి. నాలుగున్న రేళ్ళ క్రితమే వీటికి ప్రభుత్వం గడువు విధించింది. అయినా పూర్తిస్థాయిలో చర్యలు లేవు. కనీసం ఉన్నచోట అయినా జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జెడ్ఎల్‌డీ) వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు కూడా పరిశ్రమలు సిద్ధంగా లేవు. అయినప్పటికీ అటు ప్రభుత్వం, ఇటు కాలుష్య నియంత్రణమండలి నుంచి ఎలాంటి చర్యలు లేవు.

### పాఠశాలల నిర్వహణకు

## హెచ్‌ఎంల పాట్లు

**స్కూళ్లు ప్రారంభమై నెలలు గడుస్తున్నా జమకాని గ్రాంట్లు**

**వివిధ బిల్లుల చెల్లింపు, వస్తువుల కొనుగోళ్లకు నిధుల కొరత**

**సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తుందని ప్రధానోపాధ్యాయుల ఆవేదన**



హైదరాబాద్, నవంబర్ 8,ప్రభాత వార్త: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాట్ల ఖర్చు ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యా యులకు భారంగా మారింది. స్కూళ్ల ప్రాంరభమై నెలలుగడుస్తున్నా ప్రతిపాఠశాలకు అందాల్సిన గ్రాండ్లు అందడం లేదు. చాక్‌పీసులు, బోర్డుల మరమ్మత్తులు, డస్టర్లు, హాజరుపట్టిక రిజిస్ట్రర్లు, స్టేషనరీ, విద్యుత్ బిల్లు, సామాగ్రి బిల్లులు, జనవరి, ఆగస్టు నెలల్లో జెండా వందనం ఖర్చులు విద్యార్థులకు బహుమతులు ఇలా పాఠశాలలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రతిఏటా స్కూళ్లకు పాఠశాల యాజమాన్య కమిటీ ఖాతాలో గ్రాంట్లను జమచేస్తుంది. మూడు విడతల్లో అందజేసే ఈ నిధులతో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక బడులకు ఉపయోగిస్తారు. అయితే పాఠశాలలు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా ..నేటికీ స్కూల్‌గ్రాంట్స్ విడుదల చేయలేకపోవడంతో ప్రభుత్వ భడులను నిధుల కొరత వెంటాడుతుంది. ఫలితంగా నిర్వాహణ ఖర్చులు రోజురోజుకు భారంగా మారుతుంది. ప్రభుత్వం గ్రాంట్లు ఇవ్వకపోవడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులే సొంతంగా ఖర్చులు భరించి సౌకర్యాలు కల్పించాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ జిల్లాలో 498 ప్రాథమిక, ప్రాథమికోన్నత 182 పాఠశాలలున్నాయి. వీటిల్లో 1,17,502 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో 1-15 మంది విద్యార్థులుంటే రూ.12, 500, 16 నుంచి 100లోపు ఉంటే రూ.25వేలు, 100నుంచి 200లోపు ఉంటే రూ.75వేలు, వెయ్యికిపైగా ఉంటే లక్షల వరకు నిధులు మంజూరు చేస్తారు. ఈనిధులతో ఎస్‌ఎంసి తీర్మాణాలతో పాఠశాలల నిర్వాహణకు వినియోగించుకునేందుకు ప్రధానోపాధ్యాయులకు అధికారం ఉంటుంది. ముఖ్యంగా ఈనిధులతో విద్యుత్ బకాయిల చెల్లింపుతోపాటు,టేబుళ్ల ఫ్యాన్లు, లైట్లు ఇతర మరమ్మతులు బాగు చేసుకునే అవకాశం ఉంటుంది అయితే 2020-21లో బడులకు సగం నిధులు కేటాయించగా.. 2021-22 విద్యాసంసవత్సరంలో మొదటసగం నిధులు ఖాతాల్లో జమచేసి మిగతా నిధులను మార్చి 31 ఆర్థికసంవత్సరం ముగింపులో మంజూరు చేశారు. ఈతర్వాత ఏప్రిల్‌లో అన్ని బ్యాంక్ ఖాతాలు మూసివేసి కొత్త ఖాతాలను తెరవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అప్పటికే మంజూరైన నిధులను తిరిగి వెనక్కి తీసుకున్నారు. దాంతో మెజార్టీ బడుల్లో నిర్వాహణ నిధులు ఉపయోగించలేదు. దీంతో అప్పటి నుంచి ప్రభుత్వ బడుల్లో నిధుల కొరత వెంటాడుతుంది.

### భవనంపై నుంచి పడి

## విద్యార్థి మృతి



దినేష్‌రాజు (ఫైల్ ఫోటో)

వనస్థలిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త : ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి భవనం మూడవ అంతస్తుపై నుండి కింద పడి మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురం సిబిఐ కాలనీలో బైరపోగు రాజశేఖర్ కుటుంబం స్వాతి అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులో నివాసముంటున్నారు. రాజశేఖర్ దంపతులకు కుమారుడు బైరపోగు దినేష్‌బాబు (18), కుమార్తె ఉన్నారు. కాగా మంగళవారం తెల్లవారుజామున దినేష్‌రాజు భవనంపై వాకింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు భవనం మూడవ అంతస్తుపై నుండి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో దినేష్‌రాజు తలకు దెబ్బ తగలడంతో తీవ్ర రక్తస్రావం ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దినేష్‌రాజు ఐటిఐ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### యువతిని వేధిస్తున్న

## యువకుడికి జైలుశిక్ష



కంటోన్మెంట్, నవంబర్ 8, ప్రభాతవార్త: ఓ యువతిని వేధిస్తున్న యువకుడికి న్యాయస్థానంలో జైలు శిక్ష పడింది. బోయిన్‌పల్లి ఎస్.ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం ఫిరోజ్‌గూడ, గౌతమ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (24) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా సయ్యద్ ఇమ్రాన్ ఓల్డ్ బోయిన్‌పల్లికు చెందిన ఓ యువతిని తనను ప్రేమించాలంటూ వెంబడిస్తున్నాడు. కాగా రెండు రోజుల క్రితం సదరు యువతితో అసభ్యంగా ప్రవరిస్తూ, అసభ్యకరమైన పదజాలంతో వేధించాడు. విసుగు చెందిన యువతి సోమవారం తన సోదరుడి సహాయంతో బోయిన్‌పల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సయ్యద్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కోర్టులో హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో సయ్యద్ ఇమ్రాన్‌కు 14వ స్పెషల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చడంతో న్యాయస్థానం జైలు శిక్షఖరారు చేసింది. పోలీసులు కోర్టు ఆదేశాలతో నిందితుల్ని జైలుకు తరలించారు.

### శివకేశవులకు ప్రీతికరం కార్తీకమాసం

ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ కార్తీకపౌర్ణమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆమె కీసరగుట్టలోని శ్రీభవాని రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని శివలింగాలకు పంచామృతాభిషేకం చేశారు. కార్తీకమాసంలో శివదర్శనం చేసుకోవడంతో పుణ్యఫలితాలు కల్గుతాయని శైవక్షేత్రాలలో భక్తుల సందడి నెలకొందని పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో ఆమె కౌన్సిలర్ బర్ల శశికళతో కలిసి కార్తీకదీపారాధన నిర్వహించారు. దీపాలు వెలిగించడం ద్వారా పాపాలు తొలగిపోయి పరమశివుని ఆశీస్సులు లభిస్తాయన్నారు.

### జీవ రసాయన పద్ధతుల ద్వారా వ్యవసాయంతో అధిక లాభాలు

షాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త : జీవ రసాయన పద్ధతుల ద్వారా వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చునని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్స్ ఫైండేషన్) నిర్వాహకులు సంతోష్ తెలిపారు. మంగళవారం మండలంలోని ముద్దెంగూడ, షాబాద్, సర్దార్‌నగర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## వైభవంగా భారత్ బాలోత్సవ్

**కళలు సర్వతోముఖాభివృద్ధికి తార్కాణాలు : డా. ఎస్.వేణుగోపాలాచారి**




భారత బాలోత్సవ్‌లో ఒక దృశ్యం

రవీంద్ర భారతి, నవంబరు 8 ప్రభాతవార్త : భారత తొలి ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జరుపుకొనే బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రముఖ సంస్థలు భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో చిన్నారుల శాస్త్రీయ, సంప్రదాయ, జానపద తదితర నృత్యప్రదర్శనలతో సంస్థల అధిపతులు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితారావు నేతృత్వం నిర్వహణలో భారత బాలోత్సవ్ పేరున జరిగిన అద్భుత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ కేంద్రమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి పిల్లలకు నైతికపరమైన విద్యతోపాటు కళలు, క్రీడలు వారి మానసిక వికాసానికి, ఉల్లాసానికి, మేధస్సును తేజోవంతం చేయడానికి, సత్ప్రవర్తనకు ఎంతగానో ఉపయోగపడుతూ అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధికి తార్కాణాలుగా నిలుస్తాయన్నారు. భారత్ ఆర్ట్స్, ఏబిసి ఫౌండేషన్లు తరచూ ఇలాంటి మహోన్నత కార్యక్రమాలను గత 9 ఏళ్లుగా నిర్విరామంగా నిర్వహిస్తూ ముఖ్యంగా కళలను ప్రోత్సహిస్తూ విశ్వవ్యాప్తం చేయడమే కాకుండా నాట్యగురువులను, కళాకారులను అవార్డులతో సత్కరించడం గర్వించదగ్గ విషయమని వారి కళాసేవలను అభినందించి విశిష్ట అతిథి సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మతో కలిసి నాట్యగురువులు లక్ష్మి, కిరణ్ కుమార్, వీణాధరి, జ్యోతి, ఉమాదేవి, ఉదయశ్రీ, శైలజనాయుడు, అశ్వినిలను ఘనంగా సత్కరించి నాట్యహంస బిరుదు ప్రదానంచేసి కళాకారులను జ్ఞాపికలను అందజేశారు.

### జాతీయ అథ్లెటిక్స్‌లో విజయం సాధించిన మహిళా కండక్టర్లు



అథ్లెటిక్స్‌లో విజయ కేతనం సాధించిన ఆర్టీసి ఉద్యోగులను అభినందిస్తున్న సజ్జనార్ తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 8 ప్రభాతవార్త: ఆర్టీసి సంస్థ మనుగడ కోసం ప్రత్యేకచొరవ తీసుకోవడంతో పాటు మహిళా ఉద్యోగులు క్రీడా రంగంలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ గచ్చిబౌలి స్టేడియంలో మహిళా మాస్టర్స్ అథ్లెటిక్స్ 2022లో ఆర్టీసిలో పనిచేస్తున్న 6 గురు మహిళా ఉద్యోగులు విజయ కేతనం ఎగురవేశారు. కంటోన్మెంట్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న స్వరాజ్యలక్ష్మి, జాతీయ క్రీడా రంగాల్లో ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటినందుకు మంగళవారం కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్ రాంమోహన్‌రావ్, అస్టెంట్ మేనేజర్ సుఖేందర్‌రెడ్డిలతో పాటు డిపో సూపర్ వైజర్లు తోటి సిబ్బంది స్వరాజ్య లక్ష్మిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన రాజు

పేట్‌బషీరాబాద్, నవంబర్ 8 ప్రభాతవార్త: రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగంతో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటకు చెందిన గొల్లపల్లి రాజు(46) కొన్ని నెలల క్రితం నగరానికి వలస వచ్చి జీడిమెట్ల దండ మూడి ఎన్‌క్లేవ్ దుర్గామాత ఆలయం సమీపంలో కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. కొంపల్లి బ్రిడ్జి సమీపంలోని కేవీ రెడ్డినగర్‌లో ఓపెన్ ఫ్లాట్స్‌కి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తుండగా వాటర్ బాటిల్ కోసం ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి దాటి బాటిల్ తీసుకొని తిరిగి రోడ్డు దాటుతున్న సమయంలో మేడ్చల్ నుంచి కొంపల్లి వైపుగా అతివేగంగా దూసుకువచ్చిన కారు రాజును ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు గమనించి రాజును దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించ గా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని ధృవీకరించారు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



తార్నాక, నవంబర్ 8 ప్రభాతవార్త: మతి స్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. లాలాపేట్‌లో నివాసముండే నేతికార్ శివాజీ(55) ఆయన సోదరుడితో కలిసి నివాసముంటున్నాడు. కాగా ఇతనికి గత కొంత కాలంగా మతి స్థిమితం సరిగా లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన శివాజీ తిరిగి ఇంటికి చేరుకొనలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆయన ఆచూకి కోసం గాలిస్తున్నారు.

### భార్యభర్తలపై పెట్రోల్ పోసి హత్యాప్రయత్నం చేసిన మాజీ భర్త

హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త: తన మాజీ భార్య మరోక వ్యక్తిని పెళ్ళి చేసుకున్నదన్న అక్రోషంతో భార్య, భర్తలపై అతను పెట్రోల్ పోసి హత్యచేయడానికి ప్రయత్నించగా, ఈ ప్రయత్నంలో వారితోపాటు మరో పసి పిల్లాడు కూడా తీవ్రమైన గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నారాయణగూడ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం అంబర్‌పేటకు చెందిన నాగుల సాయి (35), చిక్కడపల్లి నివాసి అయిన అర్తీని ఎనిమిదేళ్ళ క్రితం ప్రేమ పెళ్ళి చేసుకోవడం జరిగింది. ఇద్దరి మధ్య నెలకొన్న వైవాహిక సమస్యల నేపథ్యంలో ఆమె నాగులసాయి నుంచి పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లి లక్ష్మీ బాయి, సోదరుడు జితేందర్‌తో కలిసి ఆమె నివసిస్తున్నది. ఈ క్రమంలో చిక్కడపల్లికి చెందిన నాగరాజుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇద్దరు పెళ్లి చేసుకున్నారు. తనను కాదని నాగరాజును పెళ్ళి చేసుకున్నదన్న అక్రోషంతో నాగుల సాయి ఆమెను, నాగరాజును చంపేందుకు కుట్ర పన్నారు. కుట్ర పన్నిన నాగుల సాయి సోమవారం రాత్రి నారాయణగూడ ఎక్స్‌రోడ్డు వద్ద గల కూరగాయల మార్కెట్ దగ్గర ఇద్దరూ ఉన్న విషయాన్ని కనిపెట్టిన నాగుల సాయి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను వారిపైన పోసి నిప్పంటించారు. ఆ పెట్రోల్ అర్తీ ఒడిలో ఉన్న చంటి పిల్లాడుపైన కూడా పడింది. దీంతో ముగ్గురు మంటల్లో చిక్కుకుపోయారు. నాగరాజు, అర్తీలకు 50 శాతం శరీరం కాలి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చంటిపిల్లాడి పరిస్థితి విషమంగా ఉంది. నాగుల సాయి పరారిలో ఉన్నారు. ఈ కేసును నారాయణగూడ సిఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ జ్యోతి దర్యాప్తు చేస్తున్నారు.

### భక్తి, శ్రద్ధలతో కార్తీకపౌర్ణమి వేడుకలు

ఘట్‌కేసర్, నవంబర్ 8, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలంలో కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం చంద్రగ్రహణం ఉండటంతో కొందరు సోమవారం నాడే కార్తీకపౌర్ణమిని జరుపుకున్నారు. ప్రజలు ఇళ్లలో శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు, కేదారగౌరీ నోములను భక్తి, శ్రద్దలతో నిర్వహించుకున్నారు. పలు శివాలయాల్లో ఉదయం సాయంత్రం భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఘట్‌కేసర్, పోచారం, సంస్కృతిటౌన్‌షిప్, చౌదరిగూడ, వెంకటాద్రిటౌన్‌షిప్, ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాపసింగారం, ఘణాపూర్, వెంకటాపూర్, మర్రిపల్లిగూడ, కొండాపూర్, ఎన్‌ఎఫ్‌సీ నగర్, నారపల్లి, కాచవానిసింగారం, అన్నోజీగూడ, ,ఆర్‌జికెకాలనీ, యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, మక్తా తదితర గ్రామాల్లో కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని భక్తి, శ్రద్దలతో నిర్వహించారు. ఘట్‌కేసర్‌లో బంతి, చామంతి పూజలు, పూజాసామాగ్రీ, ప్రమిదల విక్రయాలు జోరుగా జరిగాయి. పోచారంలోని సర్వమంగళాదేవి సమేత స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయం, శివారెడ్డిగూడ శ్రీప్రసన్న వీరాంజనేయ మల్లికార్జునస్వామి, లింగాలకుంట శ్రీనాగలింగేశ్వరస్వామి, అన్నోజీగూడ శ్రీగాయత్రీదేవాలయం, యంనంపేట్ శ్రీరంగనాథ, వెంకటేశ్వరస్వామి, వెంకటాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి శివాలయం, ఎదులాబాద్‌లోని భ్రమరాంబమల్లికార్జునస్వామి, ఎన్‌ఎఫ్‌సీనగర్ శ్రీవిశ్వేశ్వరగిరిక్షేత్రం, ప్రతాపసింగారం భవాని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, తదితర ఆలయాల్లో సాయంత్రం ప్రజలు పెద్ద సంఖ్యలో వెళ్లి కార్తీక దీపాలను వెలిగించారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, నవంబరు 8 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 9వ తేదీ బుధవారం ఉదయం 11 నుంచి 1 వరకు హాసన్ నగర్,జూపార్కు రోడ్డు,శాస్త్రిపురం,మీరాలం చెరువు,రషీద్ కాలనీ,11 నుంచి 12 గంటలు వరకు ఉప్పుగూడ,తానాజీనగర్, లలితాబాగ్, అంబికానగర్,పటేల్ నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

## అంగరంగ వైభవంగా గురునానక్ జయంతి



కుటుంబ సమేతంగా పాల్గొన్న సిక్కులు, (ఇన్‌సెట్‌లో) విశాల్ దీవాన్‌లో కీర్తనలు అలపిస్తున్న దృశ్యం

గోషామహల్, నవంబర్ 8 ప్రభాతవార్త: సిక్కుల మొట్టమొదటి మత గురువు గురు నానక్‌దేవ్‌జీ 553 జయంతోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన విశాల్‌దీ వాన్ ఉత్సవాలు అంగరంగవైభవంగా ముగిసాయి. విశాల్ దీవాన్ ఉత్సవాలకు నగరంనుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున్న సిక్కులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. గురునానక్ జయంతి ఉత్సవ విశాల్ దీవాన్‌లో గుర్బానీకీర్తనలను భక్తి శ్రద్దలతో ఆలపించారు. రంగు రంగుల పూవ్వులతో అలంకరించినబడిన ప్రధాన వేదికపై సిక్కుల పవిత్ర గ్రంథం ఏర్పాటు చేశారు. దర్బార్‌సాహెబ్ గోల్డెన్ టెంపుల్‌కు చెందిన బాయ్ సత్తానమ్‌సింగ్‌జీ, పాట్నాకు చెందిన బాయ్ సర్బాజిత్‌సింగ్‌జీ, హారీసింగ్ బాయ్, చరణ్‌జీత్‌సింగ్,జగ్‌దేవ్‌సింగ్‌జీ బాయ్‌లు నగర కీర్తనలు ఆలపించారు.

సిక్కులు తరలివచ్చి పవిత్ర గ్రంథంను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభందక్ కమిటి ప్రతినిధులు ఎస్.బల్‌దేవ్‌సింగ్ బగ్గా, ఎస్.కుల్‌దీప్ సింగ్‌బగ్గా, ఇంద్రజీత్‌సింగ్,ఎస్.జగ్‌మోహన్‌సింగ్,హారీప్రితసింగ్, మీడియా ఇన్‌చార్జ్ బచ్చన్‌సింగ్‌లతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సిక్కులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. కాగా భక్తులకు అన్నదానం చేశారు.

## చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత



గ్రహణంతో మూసివేసిన హిమాయత్‌నగర్, లిబర్టీలోని తిరుమల తిరుపతి దేవస్థానం

హైదరాబాద్, సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త : చంద్రగ్రహణం కారణంగా నగరంలో ఆలయాలు మూసివేశారు. ఈ ఏడాది చివరి చంద్ర గ్రహణం కనిపించింది. హైదరాబాద్‌లో చంద్ర గ్రహణం పాక్షికంగా కనిపించింది. ఈ సందర్భంగా ఆలయాలు మూసివేశారు. నగరంలో చంద్ర గ్రహణం మంగళవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రారంభమై 7.26 గంటలకు ముగిసింది. అంటే గంట 46 నిమిషాల పాటు గ్రహణం కొనసా గింది. శ్రీనగర్‌కాలనీ,హిమాయత్‌నగర్ లిబర్టీ, జూబ్లిహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు, చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి టెంపుల్, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్, సంఘీ టెంపుల్, బిర్లాటెంపుల్, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి టెంపుల్,జూబ్లీహిల్స్ పెద్దమ్మటెంపుల్, కట్టమైసమ్మ టెంపుల్, పాతబస్తీ భాగ్యలక్ష్మి టెంపుల్, బల్కంపేట ఆలయాలు, చిలుకూరు బాలాజీ టెంపుల్, నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం ఆలయాలు మూసివేయబడ్డాయి. తిరిగి బుధవారం ఆలయాలు తెరుచుకోనున్నాయి.పుణ్యాహవచనం, ఆలయ శుద్ధి అనంతరం భక్తులకు దైవదర్శనం మొదలవుతుంది.

**టిటిడి శ్రీవారి దేవాలయం మూసివేత**

**సైఫాబాద్..** చంద్రగ్రహణంను పురస్కరించుకుని మంగళవారం లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, బషీర్‌బాగ్‌లోని శ్రీకనకదుర్గా దేవాలయం తదితర బస్తీలలోని అలయాలను నిర్వాహకులు మూసివేశారు. టిటిడి శ్రీవారి దేవాలయాన్ని ఉదయం పూజల అనంతరం 7 గంటలకు పూజారులు, సిబ్బంది గుడి తలుపులకు తాళాలు వేశారు. సాయంత్రం 7 గంటలకు తిరిగి తలుపులు తెరిచారు. అనంతరం దేవాలయంలో శుద్ధి కార్యక్రమం జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి కైంకర్యాలు, ఏకాంత సేవ జరిగింది. బుధవారం భక్తులకు శ్రీవారి దర్శనం పున:ప్రారంభం జరుగుతుందని ఎఇఓ జగన్‌మోహనాచారి తెలిపారు.

# బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

## - నాగుల శ్రీనివాస్ యాదవ్

**కంటోన్మెంట్, నవంబర్ 8, ప్రభాతవార్త :** ఉన్నత కులాలు ఈడబ్ల్యుఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించడం ఎసరైందికాదని హైకోర్టు న్యాయ వాధి, లాయర్స్‌ఫోరమ్ సోషల్ జస్టిస్ నాగుల శ్రీనివాస్ యాదవ్, సామాజిక ఉద్యమ నేత వి.జి. ఆర్. నారగోని, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు పిట్ల నాగేశ్ ముదిరాజ్, ఎం. జగన్ మోహ న్ ముదిరాజ్, తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన బీసీ కులాల సమావేశం లో వారు మాట్లాడుతూ రాజ్యాంగ ప్రకారం ఈడబ్ల్యుఎస్ వారికి ప్రస్తావన లేవన్నారు. కేవలం సామాజిక, విద్యా వెనుక బడిన వారికి రిజర్వేష న్లు కల్పించాలని రాజ్యాంగంలో పొందుపర్చిందన్నారు. జనాభాలో 50 శాతం కలిగి ఉన్న బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అందించాలని న్యాయ స్థానం గుర్తించాలన్నారు. 10 శాతం జనాభాల లేని వారికి రిజర్వేషన్ కల్పించడం విచారకరమన్నారు. అన్ని వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కులాల బీసీ సంఘాల నేతలు రవి ముదిరాజ్, బి.కిషన్ యాదవ్, డి.సంపత్ కకుమార్ గౌడ్, అజిత్ నేత, సత్యనారాయణ చారి, బాల లింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 12న గీతాంజలి దేవశాల రజతోత్సవ వేడుకలు

**హైదరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త :** గీతాంజలి దేవశాల రజతోత్సవ వేడుకలను ఈనెల 12న సికింద్రాబాద్ బాలంరాయిలోని పాఠశాల అవర ణలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సి పల్ మాధవిచంద్ర తెలిపారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ ప్రిన్సి పల్ అంజనా మూర్తి, హెడ్ మిస్ట్రెస్ శాలిని సింగ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. 1997నుంచి విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ ఎడూకేషన్ వరల్డ్, సిఫోర్ సర్వే వంటి సంస్థల ద్వారా ఉత్తమ పాఠశాల అవార్డులు అందుకున్నామని తెలిపారు. ఈవేడుకల సందర్భం గా వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ..పూర్వవిద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.




# స్వయం ఉపాధికోసం అధునాతన సాఫ్ట్‌వేర్ సిస్టం

**హైదరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురుచూడకుండా స్వయం ఉపాధిని ఎంచుకుని వ్యాపారాలు చేసుకోవాలని ఆశించేవారికోసం మార్గ్ ఈఆర్‌పి సంస్థ నైన్‌ప్లస్ ఇన్‌వెంటరీ అండ్ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో వ్యాపార నిర్వాహణకోసం ఈఅకౌంటింగ్, బిల్లింగ్, జీఎస్టీఫైల్, ఈఇన్‌వాయిస్ జనరేట్ చేసుకోవచ్చని తెలిపింది. ఈమేరకు మంగళవారం నగరంలోని హోటల్‌అబోడ్‌లో నిర్వహించిన సమావేశంలో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించింది. ఈసందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ఠాగూర్ అనూప్‌సింగ్, ఎండి మహేందర్‌సింగ్‌లు మాట్లాడుతూ తాము రూపొందించిన ఈసాఫ్ట్‌వేర్ మామూలు ట్యాబ్‌లో సైతం వినియోగించుకునేలా ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా తమకు 10లక్షలమందికి పైగా తమ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. అన్నిరంగాలతోపాటు వ్యాపారరంగంలోనూ, డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా మార్పులు చేసుకునే వెసులుబాటు సౌకర్యం ఇందులో ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాహుల్ అగర్వాల్, రాజీవ్ రాయ్, రీజినల్ మేనేజర్లు మనోజ్‌కుమార్ ముదిరాజ్, మహ్మద్ యాసిన్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 27, 28, 29 తేదీలలో ఏఐటియుసి రాష్ట్ర 3వ మహాసభలు

**సైఫాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** శ్రామికవర్గం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలు ఈ నెల 27, 28, 29 తేదీలలో యాదగిరిగుట్టలో జరుగుతాయని ఏఐటియుసి ప్రకటించింది. ఈ మేరకు సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాల్‌రాజ్, వి.ఎస్.బోస్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ ఆవిష్కరించి మాట్లాడారు. 27వ తేదీన వేలాది మంది కార్మికులతో భారీ బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలో ముఖ్యఅతిథిగా ఏఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. 28, 29 తేదీలలో ప్రతినిదుల సభలు జరుగుతాయని, రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది ప్రతినిధులు హాజరై వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఉజ్జిని రత్నాకర్‌రావు, ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య, కోశాధికారి ప్రేమ్‌పావని, కార్యదర్శులు నందూరి కరుణకుమారి, బి.వెంకటేశం, ఎం.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# మనసులను హత్తుకునేలా విద్యార్థుల ప్రదర్శనలు

**హైదరాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త :** స్వాతంత్ర్యం, స్వేచ్ఛను పొందిన ఘడియలను గుర్తుచేసుకుంటూ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు మన సులను హత్తుకునేలా చేశాయి. చిన్నారులు రెండు వందల సంవత్సరాలు మన దేశాన్ని పాలించిన ఇంగ్లీష్ వారి నుంచి పొందిన స్వేచ్ఛను చూపిస్తూ చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈమేరకు మంగళవారం దక్రీక్ ప్లానెట్ సీడ్స్ పాఠశాల వార్షికోత్స వ కార్యక్రమాన్ని నగరంలోని పిజెఆర్ మైదానంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయం గొట్టిపాటి సత్యవాణి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కార్గిల్ యుద్ధ విజయం, రక్షణదళాల గూర్చి, అను ఆయుధ ఆవిష్కరణను సాధించేందుకు చేసిన కృషిని ప్రదర్శించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ప్రీ తిరెడ్డి వార్షికోత్సవ నివేదికను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదం డ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శన

## తెలంగాణ రాష్ట్రమంతా సాంస్కృతిక, సాహితీ చైతన్యం కలిగి ఉంది

### - జాతీయ కవి, సినీ గేయరచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ

**చిక్కడపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రమంతా సాంస్కృతిక, సాహితీ చైతన్యం కలిగి ఉందని జాతీయ కవి, సినీ గేయరచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళామ ధురిమ సంయుక్త ఆధ్వర్యంలో 'వందనం అభివం దనం..' పేరుతో సినీ సంగీత విభావరి, 'అమ్మా నన్ను అమ్మకే' పేరుతో ప్రత్యేక నాటక ప్రదర్శన అందరిని ఆలోచింపచేసింది. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సుద్దాల అశోక్‌తేజ, మాజీ కేంద్ర మంత్రతి సముద్రాల వేణుగోపాలచారి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ హాజరై అద్భుతంగా నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులను సత్కరిం చి అభినందించారు. కార్యక్రమంలో ప్రజాభారతి సాహితీ సంస్థ అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ప్రజయ్ రాజ్, ఉత్తమ గ్రామీణ విలేకరి అవార్డుగ్రహీత ఎస్ఎస్.చారి పాల్గొనగా నిర్వాహకుడు బిక్షపతి స్వాగ తం పలికారు. కళామాధురి గ్రామీణ ప్రాంతం నుంచి నగరం వేదికపై ప్రదర్శన ఇవ్వటం ముదావహం అని అన్నారు. డ్రైవర్ స్థితి నుంచి ఒక కళాసంస్థ స్థాపించి గాయని స్థాయికి ఎదిగిన బిక్షపతి వ్యక్తిత్వం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యాఖ్యానబ్రహ్మ పిఎంకె.గాంధీ వ్యవహరించారు.


కార్యక్రమంలో పాల్గొన్న సుద్దాల అశోక్‌తేజ, మామిడి హరికృష్ణ తదితరులు

# వికలాంగులకు రూ.10వేలు ఫించన్ ఇవ్వాలి

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** వికలాంగులకు రూ.10వేలు ఫించన్ ఇవ్వాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం అంబర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో సంఘం అంబర్‌పేట నియోజకవర్గం స్థాయి సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో కొల్లి నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫించన్ రూ.3016 నుంచి రూ.10వేలు పెంచాల ని, వికలాంగుల పరిస్థితి దారుణంగా ఉన్నాయని, అధిక ధరలు పెరుగుదల వలన్ల నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఫించన్‌ను రూ.10వేలు చేయాల న్నారు. అర్హులైన వికలాంగులందరికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళను కేటాయించాలని, ప్రతి వికలాంగుడికి స్వయం ఉపాధి కింద రూ.5లక్షల రుణాన్ని మంజూరు చేయాలని, వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగా లను భర్తీ చేయాలని, వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఛలో కలెక్టరేట్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో 5గురు సభ్యులతో అంబర్‌పేట నియోజకవర్గం కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా నాయకులు గోవింద్‌రాజ్, బిక్షపతి, సరిత, శ్రావణ్, శంకర్, జ్యోతి, క్రాంతి, పద్మ, బాలకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న కొల్లి నాగేశ్వరరావు

# సింఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో మేలు

## - మంత్రి తలసాని

**కంటోన్మెంట్, నవంబర్ 8, ప్రభాతవార్త :** మెరుగైన వైద్య సేవలను కార్పోరేట్ ఆసుపత్రులలో ఉచితంగా చేయించు కునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో 40 మంది లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంతో సరైన వైద్యం పొందలేక పోతున్న నిరుపేదలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో ఆపద్బాంధవుడిగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన కార్పోరేటర్లు కె. హేమలత, కొలను లక్ష్మి, మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్లు ఆకుల రూప హరిక్రిష్ణ, అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్ శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అంజేస్తున్న మంత్రి తలసాని

# 'ఇట్‌క్లా' రజతోత్సవ అవార్డుల ప్రదానం

**చిక్కడపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త :** సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక,సారస్వత సంఘం(ఇట్‌క్లా) ఆధ్వర్యంలో 'ఇట్‌క్లా' రజతోత్స వ అవార్డులను ప్రదానం చేయబోతున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు, సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు, ఎ.విజయ్‌కుమార్ వివరించారు. 10న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆవరణలో సాయంత్రం జరిగే ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై జీవన సాఫల్య పురస్కారాలను అన్నమయ్య పద కోకిల, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, సుప్రసిద్ధ గేయకవి డాక్టర్ ఎం.కె. రాము, అంతర్జాతీయ నృత్యకళాకారిణి డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్, హస్తకళా శిరోమణి డాక్టర్ పివిఎన్.కమలప్రసాద్‌రావు, జాతీయ కార్మికసేవా శిరోమణి డాక్టర్ చోడవరపు శంకరరావు, గాంధేయవాది దోగిపర్తి శంకరరావులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో నృత్యచూడామణి డాక్టర్ ఆనందా శంకర్ జయంత్, దూరదర్శన్ కార్యనిర్వహణాధికారి కామేశ్వరి, అలయ్-బలాయ్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి, ప్రముఖ పారిశ్రామికవేత్త బండారుసుబ్బారావు, పూర్వ దక్షిణమధ్యరైల్వే జీఎం సి.రామకృష్ణ, సినీ దర్శకులఉ రేలంగి నరసింహారావు, క్రీడారత్న పివిఎస్.ప్రసాద్‌రావు తదితరులు పాల్గొంటారన్నారు. ఇదే కార్యక్రమంలో గీతామూర్తి, డాక్టర్ పి.విజయకుమార్, పాత్రికేయులు డాక్టర్ మహ్మద్ రఫీ, కళారత్న విఎస్.రాజ్యలక్ష్మి, వ్యాఖ్యానవాచస్పతి డాక్టర్ లంక లక్ష్మినారాయణ, కళారత్న ఎ.మల్లికార్జునరావు, ప్రముఖ గాయనీ ఆమని, అపర ఘంటసాల డి.ఎ.మిత్ర, వి.వి.సత్యప్రసాద్‌లకు అందించబోతున్నట్లు పేర్కొన్నారు.

# బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు సుందరీకరణ పనులకు శంకుస్థాపన

**చిక్కడపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త :** బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి ప్రారంభిస్తారని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.పాండయ్య, ఆర్.సంతోష్‌గౌడ్, కోశాధికారి రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎంఎన్.రావు వివరించారు. బుధవారం ఉదయం పార్కులో వాకింగ్ ట్రాక్ మరమ్మత్తు, ట్రాక్ అభివృద్ధి, పార్క్ లాన్ సుందరీకరణ పనులను ప్రారంభిస్తారని, వాకర్స్ సభ్యులు, వాకర్లు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

# మృతి చెందిన 5గురు విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

## కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్ మంత్రి కెటిఆర్‌కు విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** ఇటీవల అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక డివిజన్‌కు చెందిన అమాయకులైన 5గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు చెరువు లోపడి మృతిచెందారని వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవా లని గోల్నాక డివిజన్ కార్పోరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్‌కు వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న మూడు ఎకరాల భూమిలో పార్కు ఏర్పాటు చేసి ఆ పార్కుకు సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేరు పెట్టాలని, డివిజన్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల మునుగోడులో జరిగిన ఎన్నికల సందర్భంగా కెటిఆర్ మునుగోడును దత్తత తీసుకుని టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం విశేషంగా కృషి చేసినందుకు ఆమె కెటిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


వినతి పత్రాన్ని సమర్పిస్తున్న లావణ్యశ్రీనివాస్‌గౌడ్

# ఉత్తమ నారాయణ సేవ పురస్కార ప్రదానం

**చిక్కడపల్లి నవంబరు 8, ప్రభాతవార్త :** పేదలకు అన్నదానాలు, క్యాన్సర్ రోగులకు ఆహారాన్ని అందించడం ఇతర సేవాకార్యక్రమాలు నిర్వహించినందుకు గాను బర్కత్‌పుర వాకర్స్‌ఫ్రెండ్స్‌క్లబ్‌కు మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో అవార్డులను అందించే కార్యక్రమం జరిగింది. ఈ పురస్కారాన్ని క్లబ్ అధ్యక్షుడు బిఎస్.శ్రీనివాస్, మురళీకృష్ణ, ఆర్.మురళీకృష్ణ, నారాయణమూర్తి, రవికుమార్, చందు, మూర్తి, రమేశ్, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా నాలుగు సంవత్సరాల కాలంలో చేసిన సేవలకు ఈ పురరాన్ని అందించడం జరిగిందని కాబోయే ఆర్‌సి ఎస్.మురళీకృష్ణ వివరించారు. కాగా ఇటీవల హైదరాబాద్ నగరంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రెసిడెంట్ ఎంబి.సుబ్బారెడ్డి, గవర్నర్ ఎస్ఎస్‌కె.ప్రసాద్, గోపాల్‌రెడ్డి, కాబోయే ఆర్‌సి ఎస్.మురళీకృష్ణ, దామోదర్‌రెడ్డి, రామానందం, వి.నాగభూషణం, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారని ఎస్.మురళీకృష్ణ వివరించారు.



## మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యత

**అఫ్జల్‌గంజ్, నవంబర్ 8, ప్రభాతవార్త :** ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జాంబాగ్ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు మీసాలక్రాంతి అన్నారు. హిందీనగర్ జలమండలి అధికారులతో కలిసి డివిజన్‌లో పాదయాత్ర చేశారు. జాంబాగ్ డివిజన్ 5-3బ్లాక్‌పరిధిలో డ్రైనేజీ, మంచినీటి సరఫరాలో సమస్యలను స్థానిక ప్రజలు క్రాంతి దృష్టికి తీసుకురాగా, వెంటనే హిందీనగర్ జలమండలిమేనేజర్ శేఖర్‌తో కలిసి పాదయాత్రచేసి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిబాబా, ప్రశాంత్, నర్సింగ్, రాఘవ, అహ్మద్‌పాషా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న మీసాలక్రాంతి


సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేష్

# సిసి కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** నల్లకుంట డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమోరాలను మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి కెమోరాలు ఏర్పాటు చేసుకున్న నల్లకుంటవాసులను అభినందించారు. సిసి కెమోరాల ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పడుతున్నా యని అన్నారు. ప్రతి కాలనీ, వీధిలో సిసి కెమోరాలు అమర్చుకోవడానికి స్థానికులు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో కార్తీక మాసోత్సవ పూజలు



**చిక్కడపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త :** పవిత్రమైన కార్తీకమాసోత్స వాన్ని పురస్కరించుకుని ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తిప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి, లక్ష్మి, రాజన్, రాజు, వేదపండితులు కాశీనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రిలయెన్స్ అధినేత అంబాని దిష్టిబొమ్మ దహనం

**చిక్కడపల్లి :** క్షౌరవృత్తిలోకి రిలయెన్స్ సంస్థ రావద్దు, వచ్చినచో ఆ సంస్థలు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరిస్తూ నాయీబ్రాహ్మణ సంఘం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో రిలయెన్స్ సంస్థల అధినేత అంబాని దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్యక్రమం మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో జరిగింది. సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నవీన్, జైహింద్, మురళీ, రాకేశ్ పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

**తార్నాక, నవంబర్ 8, ప్రభాతవార్త :** మతి స్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. లాలాపేట్‌లో నివాసముండే నేతికార్ శివాజీ(55) ఆయన సోదరుడితో కలిసి నివాసముంటున్నాడు. కాగా ఇతనికి గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన శివాజీ తిరిగి ఇంటికి చేరుకొనలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆయన ఆచూకి కోసం గాలిస్తున్నారు.


నేతికార్ శివాజీ (ఫైల్)

# శ్రీవారి సన్నిధిలో లింగాకారంలో దీపారాధన


పూజలు నిర్వహిస్తున్న శ్రీనాథ్‌గౌడ్ దంపతులు

**చిక్కడపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త :** కార్తీక పౌర్ణమి సందర్భంగా చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ఆలయం వ్యవస్థాపక వంశీయుడు కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్వామివారి సన్నిధిలో లింగాకారంలో ఏర్పాటు చేసిన దీపాలు వెలిగించారు.

# కార్తీకమాస పూజలు

**బేగంబజార్, నవంబర్ 8, ప్రభాతవార్త :** కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అంకుట్ పూజ కార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిజెపి కా ర్పొరేటర్ గొంటిశంకర్‌యాదవ్ పాల్గొన్ని ప్రత్యే కపూజలు చేశారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్‌ను శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్ర మంలో పెద్ద ఎత్తున్న మహిళలు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్

# ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలి

## - జంపనప్రతాప్

**కంటోన్మెంట్, నవంబర్ 8, ప్రభాతవార్త :** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. కార్మీక పవిత్ర మాసంను పురస్కరిం చుకొని కంటోన్మెంట్ 1వ వార్డు బోయిన్‌పల్లిలోని శ్రీ బోలా శంకర్ ఆలయంలో నిర్వహించిన లక్ష దీపోత్సవ వేడుకల్లో జంపన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేత టింకూ గౌడ్, ఆలయ ప్రతినిధులు ముఖేశ్ యాదవ్, వరప్రసాద్, ఆలయ పూజారి రాధాకృ ష్ణమూర్తి శర్మ, ఆర్గనైజర్లు పరమేశ్, కిషన్, సాయి కిషన్, నర్సింగ్ రావ్, రాయల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష దీపోత్సవం వేడుకల్లో పాల్గొన్న జంపనప్రతాప్

# కంటోన్మెంట్ మెంట్‌ను అభివృద్ధిపర్చడమే ధ్యేయం : రామక్రిష్ణ

**కంటోన్మెంట్, నవంబర్ 8, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని సివిలి యన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. బస్తీ బాట కార్యక్రమాల్లో భాగంగా 7వ వార్డులోని ఎ.స్.పి. కాలనీలో లక్షలాది రూపాయల వ్యయతో ఏర్పాటు చేయనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రోడ్డు నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్.కె. మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలు అభివృద్ధి జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.పి.అధ్యక్షులు లింగమూర్తి, ఉపాధ్యక్షులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బిజెపి నాయకులు కె.బి.శంకర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామక్రిష్ణ

# పెండింగ్ రిజిస్ట్రేషన్ల అనుమతివ్వడం సంతోషదాయకం

**గన్‌ఫౌండ్రి, నవంబర్ 8, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర పురపాలక, ఐటి శాఖ మంత్రి కెటిఆర్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.మమతసం తోష్ గుప్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న గన్‌ఫౌండ్రి డివిజ న్ పరిధిలోని బ్యాండ్ లైన్‌లోని గృహాలకు పునర్ధరణకు రిజిస్ట్రేషన్ అనుమతి ఇవ్వడంపట్ల వారు సంతోషం వ్యక్తంచేశారు. మునుగోడు ఉప ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముఖ్యమంత్రికెసిఆర్, మంత్రి కెటిఆర్ సారథ్యంలో మునుగోడు ప్రజలు బిఆర్ఎస్ పార్టీని గెలిపించి అభివృద్ధికి పట్టంకట్టారని వారు తెలిపారు.



# శృంగేరి శంకర్‌మఠంలో 'హరికథా మహోత్సవాలు'



మొగిలిచెర్ల నాగమణిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, నవంబరు 8, ప్రభాతవార్త :** నల్లకుంటలోని శృంగేరి శంకర్‌మఠంలో శ్రీ పూర్ణయజు కళాపీఠం, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముట్నూరి యజునారాయణశర్మ భాగవతార్ 113వ జయంతి సందర్భంగా 'హరికథా మహోత్సవాల' కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత సీనియర్ ఐఎఎస్ అధికారి ఎంవిఎస్.ప్రసాద్ హాజరై అద్భుంగా హరికథాగానం చేసిన భాగవతారిణి మొగిలిచెర్ల నాగమణి(తెనాలి)లను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా భాగవతారిణి మొగిలిచెర్ల నాగమణిచే 'దక్షయజ్ఞం' హరికథాగానం అద్భుతంగా సాగింది. వయోలిన్‌పై ఎం.శశిభూషణరావు, మృదంగంపై ఎం.మురళీకృష్ణ వాద్యసహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.పద్మనాభరావు, శ్రీ పూర్ణయజు కళాపీఠం కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు, శంకర మఠం(నల్లకుంట) శాఖాధిపతి కె.కృష్ణారావు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం బిసి కుల గణన చేపట్టాలి

**హైదరాబాద్, నవంబరు 8, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం బిసి కుల గణన చేపట్టాలని తెలంగాణ బిసి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా జల్లా, మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ వర్గం నష్టపోకుండా ఉండాలంటే బిసి కులగణన జరగాల్సిందేనని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదికను పంపిందని కేంద్రం దీనిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. బిసి కులగణన జరిగితే వివిధ కులాలకు ఖచ్చితమైన రిజర్వేషన్‌ల శాతాన్ని నిర్ణయించవచ్చునని చెప్పారు. ఈ సమావేశంలంఓ జాగృతి సంస్థ నాయకులు బి.లింగంగౌడ్, కత్తుల సుదర్శనరావు, అచ్చిని రమేష్, లవంగం ఆంజనేయులు, వేణుగోపాల్ చారి, పుట్ట యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.


నగరంలో జరిగన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మోడల్స్

## ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, నవంబర్ 8 ప్రభాతవార్త: ఈనెల 12న తెలంగాణకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి బేగంపేట్ విమానాశ్రయం లో ఘన స్వాగతం పలకాలని మంగళవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ బీజేపి శ్రేణులకు పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివి జన్ పరిధి చిత్తారమ్మ ఆలయంలో బీజేపి జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి నిర్వహించిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన తెలంగాణ రామగుండంలోని ఎరువుల కర్మాగారాన్ని జాతికి అంకితం చేయడానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీకి ఘనంగా స్వాగతం పలకడానికి కుత్బుల్లాపూర్ నుంచి అధిక సంఖ్యలో బీజేపి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రధాని పర్యటనను బీజేపి శ్రేణులు విజయవంతం చేసేందుకు జనసమీకరణ చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపి మాజీ ఉపాధ్యక్షుడు డా.మల్లారెడ్డి, నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పాపయ్య గౌడ్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు గిరివర్ధన్‌రెడ్డి, విగ్నేశ్వర్, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలి




అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న బహుజనులు

సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకు నేంత వరకు ఉద్యమించాలని బహుజన ముక్తి పార్టీ అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా మంగళవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆనేక మంది బహుజనులు నిరసన ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక విద్యారంగంలో వెనుకబాటు తనం ఆధారంగా భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీ, బిసిలకు రిజర్వేషన్‌లను అమలు చేసిందన్నారు. అగ్రవర్ణ పాలకులు తమ కులాలకు ప్రయోజనం చేర్చేందుకు రాజ్యంగా సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఆర్థిక వెనుకబాటు ముసుగులో ఆస్తులు, సంపద కలిగియుండి ప్రభుత్వ ఉద్యోగాలలో 75 ఏళ్ళుగా అధికారం అనుభవిస్తున్న వర్గాలకు పది శాతం రిజర్వేషన్‌లు అమలు చేయడం తగదన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో ఆర్టీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వలిగి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రాజేష్‌రక్షక్, విద్యార్థి నాయకుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా ఉంటా

**ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**



సమావేశంలో మైనంపల్లి

అల్వాల్, నవంబరు 8 ప్రభాతవార్త: జర్నలిస్టుల కష్ట సుఖాలలో తోడుగా ఉండానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్ పంజాబీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన నియోజకవర్గం తెలంగాణా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటుగా కార్పొరేటర్లు జితేందర్ నాధ్ శాంతి శ్రీనివాస్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జర్నలిస్టుల సమస్యలను తనవిగా భావించి సహాయ సహకారాలు అందిస్తానని మైనంపల్లి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి దళిత జర్నలిస్టుకు దళిత బందు పథకాన్ని దశల వారీగా అందిస్తానని తెలిపారు. ఆరోగ్య భీమాకు అవసరమైన డబ్బును తన జేబు నుంచే వెచ్చిస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశం లో జిల్లా సంఘం అధ్యక్షుడు గద్దమీద బాలరాజు జాతీయ కౌన్సిల్ సభ్యుడు వెంకట్రాంరెడ్డి కోశాధికారి బిక్షపతి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు రవీందర్ మల్కాజిగిరి అధ్యక్షుడు బాలాజీ కార్యదర్శి మదుసూధన్‌రెడ్డి సీనియర్ పాత్రికేయుడు శ్రీరాములు రాయుడు మహేష్ అల్వాల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వర్మరాజు, నియోజవర్గం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కులాలవారిగా రిజర్వేషన్లు విభజించడం సాధ్యం కాదు

హైదరాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త: అగ్రవర్ణ పేదలకు విద్యా, ఉద్యోగ రంగాలలో అమలు చేస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను కులాలవారిగా విభజించడం చెల్లుబాటు కాదని ఓసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి చెప్పారు. గతంలో ఎన్.చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లలో ఐదు శాతం కాపులకు, మిగిలిన ఐదు శాతం అగ్రవర్ణాల వారికి వర్తించేలా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడటం వల్ల చెల్లుబాటు కాకుండా ఏడాది పాటు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రాష్ట్రంలో అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కేవలం అగ్రవర్ణాలలో పేదలకు మాత్రమే వర్తించే విధంగా ఆర్టికల్ 103వ రాజ్యాంగ సవరణలో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు రిజర్వేషన్‌లు వర్తించని అగ్రవర్ణాలు విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. రిజర్వేషన్‌లు అమలను జీర్ణించుకోలేని చంద్రబాబు మరొకసారి కాపుసామాజిక వర్గాన్ని రెచ్చగొడుతూ మొత్తం రిజర్వేషన్‌లకే గండికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. కులాల వారిగా రిజర్వేషన్‌లు కల్పించడం రాజ్యాంగ విరుద్దమన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి : జంపనప్రతాప్

కంటోన్మెంట్, నవంబర్ 8 ప్రభాతవార్త: వివిధ క్రీడల్లో ప్రతిభకనబరుస్తున్న క్రీడాకారులను ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో ప్రతిభకనబరుస్తారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. స్పోర్ట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు బోయిన్‌పల్లి క్రీడా మైదానం అభివృద్ధికి 15 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి నందుకు ఆయన అభినందించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో త్వరలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయన్నారు. అదే విధంగా రెజ్లింగ్ రూమ్‌కు మరమ్మత్తులకు నిధులు విడుదల చేసినందుకు అభినందనలు తెలియజేశారు. అదే విధంగా క్రీడాకారులు, వాకర్స్ గ్రౌండ్‌లో కూర్చునేందుకు బేంచీలు, ఇతర సదుపాయాలు సమకూర్చేందుకు బోర్డు నిధులు విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుకుమార్, సత్య నారాయణ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నిజాంపేట, నవంబర్ 8 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కౌసల్య కాలనీలో ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా సుమారు రూ.42కోట్లతో కేజిఎం ఎన్‌క్లేవ్ నుంచి కోకాకోలా కంపెనీ వరకు కౌసల్య కాలనీ మీదుగా జరుగుతున్న ఎస్.ఎన్.డి.పి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్థానికుల నుంచి ఇతర సమస్యలను అడిగి తెలుసుకోగా నాలా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాలా నిర్మాణ పనులతో పాటు లైబ్రరీ భవ నం పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీలాగోపాల్‌రెడ్డి, కమిషనర్ వంశీకృష్ణ, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ ఆగం రాజుముదిరాజ్, ఎస్.ఎన్.డి.పి ఎస్ఈ ఆనంద్, ఈఈ నారాయణ, డిఈ నళిని, ఏఈ నాగరాజు, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా జెఎన్‌టియూ రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వినయ్ బాబు



వివిధ ఉపాధ్యాయసంఘాలతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వినయ్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 8,ప్రభాతవార్త: తెలంగాణలో 2023 మార్చిలో జరగబోయే మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెఎన్‌టియు రిటైర్డ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.వినయ్ బాబును అభ్యర్థిగా బలపరుస్తున్నట్లు తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్, తెలంగాణ ప్రొఫెషనల్ టీచర్స్ అసోసియేషన్, ప్రైవేట్ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ అసోసియేషన్,తెలంగాణ విద్యావంతుల వేదిక, తెలంగాణ ఇంజనీరింగ్ కాలేజెస్ ఫ్యాకల్టీ అసోసియేషన్‌లు తెలిపాయి. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉమ్మడిగా ఏర్పాటు చేసిన సమావేశంలో అభ్యర్థిగా వినయ్‌బాబును ప్రకటించిన ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వినయ్‌బాబు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి టీచర్ల హక్కుల కోసం కృషి చేస్తానని అందుకు ప్రతిఒక్క ఉపాధ్యాయుడు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో టిపిటిఎ నుంచి డా.కె రామకృష్ణ, టిపిటిఎఫ్ సెక్రటరీ రవీందర్, టిఈఎఫ్ఎ అధ్యక్షులు ప్రొఫెసర్ చెన్నకేశవులు, డా.యం నర్సయ్య, బిక్షపతి, టిఈసిఈఏ నుంచి వై.రమేష్ సంఘాల టీచర్లు,బహుజన నాయులు పాల్గొన్నారు.

## దీపావళి స్నేహ మిలన్ కార్యక్రమం

చార్మినార్, నవంబరు 8 ప్రభాతవార్త : పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో మంగళవారం అశోక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపావళి స్నేహ మిలన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఫంకజ్ కుమార్ అగర్వాల్, ప్రతినిధులు రవీంద్ర అగర్వాల్,జయ ప్రకాష్, సురేంద్ర,శేష్ గోయల్,టి.సునీల్,రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే




అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

నిజాంపేట, నవంబర్ 8 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.180కోట్లతో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను మంగళవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఫ్లై ఓవర్ పనులను సకాలంలో పూర్తి చేయాలని, అదేవిధంగా రోడ్డు వెడల్పు పనులను త్వరగా పూర్తిగా చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎండీఏ అధికారుల ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, హెచ్ఎండీఏ డీఈఈ వేణుగోపాల్‌రావు, ఏఈఈ రమేష్, స్థానిక కమిషనర్ వంశీకృష్ణ, అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న టీఆర్ఎస్ నాయకులు

నిజాంపేట, నవంబర్ 8 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నిజాంపేట్‌కు చెందిన మహేందర్‌కు మంగళవారం రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అందజేశాడు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్ఎంసి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, సాయి ముదిరాజ్, బొర్రా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గృహిణి అదృశ్యం

పేట్‌బషీరాబాద్, నవంబర్ 8 ప్రభాతవార్త: ఇంటి నుంచి బయటకు వెళ్ళిన గృహిణి అదృశ్యమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లాకు చెందిన మాధవరావు, భార్య మల్లమ్మ(36),ఇద్దరు కుమారులతో చింతల్ బాపునగర్‌లో జీవనం సాగిస్తున్నారు. మాధవరావు మేస్త్రి పనికి, రెండవ కుమారుడు కళాశాలకు వెళ్లగా, పెద్ద కుమారుడు ఇంట్లో నిద్రిస్తుండగా మల్లమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్ళింది. అయితే పెద్ద కుమారుడు నిద్రలేచి చూసే సరికి తల్లి ఇంట్లో లేదని తండ్రి మాధవరావుకు ఫోన్ చేసి తెలిపాడు. భర్త మాధవరావు మల్లమ్మ ఫోన్‌కు డయల్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుందని, తెలిసిన వారి బంధువులు, చుట్టుపక్కల గాలించగా ఫలితం లభించలేదు. మాధవరావు మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## 'ప్రీ స్పోర్ట్స్ మీటింగ్'కు ఎమ్మెల్యేకు ఆహ్వానం

పేట్‌బషీరాబాద్, నవంబర్8 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల గ్రామంలోని టీఎన్ఆర్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించబోయే 'ప్రీ స్పోర్ట్స్ మీటింగ్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌కు మంగళవారం స్నాచ్ ఫిట్‌నెస్ వారు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఫిట్నెస్‌పై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవనం వైపు అడుగులు వేయాలని సూచించారు. 'ఫిట్టెస్ట్ ఆఫ్ తెలంగాణ' పేరుతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్నాచ్ ఫిట్‌నెస్ వారిని అభినందించారు. ఈ 'ప్రీ స్పోర్ట్స్ మీటింగ్'కు యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని తెలిపారు.

## మా భూములు మేం దున్నుకుంటాం

షాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త : గత వంద రోజులుగా తమకు న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసనలు తెలిపిన ఎవ్వరూ పట్టించుకోకపోవడంతోనే మేం మా భూములు దున్నుకుంటున్నామని చందన్‌వెల్లి, హైతాబాద్ భూనిర్వాసితులు తెలిపారు. ప్రభుత్వం తమకు అసైన్డ్ చేసిన భూముల్లో మంగళవారం నాగళ్లు కట్టి దున్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ భూములకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయాన్ని అక్రమార్కులు కాజేసిన ఇప్పటి వరకు ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. గత వంద రోజులుగా శాంతియుతంగా నిరసనలు తెలిపి తమకు న్యాయం చేయాలని కోరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఈడబ్ల్యూఎస్‌పై సుప్రీంకోర్టు తీర్పు అన్యాయం

**దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆవేదన**

సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అత్యంత విచారకరమని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ విచారం వ్యక్తం చేశారు. కోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయ సూత్రానికి, రాజ్యాంగంలోని రిజర్వేషన్‌ల స్ఫూర్తికి విరుద్ధమన్నారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కే ంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రిజర్వేషన్‌లను రద్దుచేయాలని, కోర్టు తీర్పును రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్పును రీకాల్ చేసేవిధంగా కేంద్ర ప్రభుత్వం రివ్యూ ఫిటిషన్ దాఖలు చేయాలని కేంద్ర క్యాబినేట్‌ను కోరారు. రిజర్వేషన్‌లు అనేవి ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్‌లు రాజ్యాంగంలో కల్పించలేదని, కేవలం సామాజిక వివక్షత, అణిచివేతల ఆధారం రిజర్వేషన్‌లు కల్పించబడ్డాయన్నారు. దేశంలోని 5 శాతం ఓసి ప్రజలు 60 శాతం రిజర్వేషన్‌లు అనుభవించడానికి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా మెజార్టి ఎస్సీ, ఎస్టీ, బిసిలకు అన్యాయం జరిగిందన్నారు.

## ఘనంగా గొట్టిముక్కల పద్మారావు జన్మదిన వేడుకలు



అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న గొట్టిముక్కల

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 8, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. గొట్టి ముక్కల పద్మారావు జన్మదిన వేడుకలు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వగృహానికి అభిమానులు, కార్యకర్తలు చేరుకుని పూల మొక్కలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి తనవంతు బాధ్యతగా ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ సాటి మనిషిగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్న వారు అభిమానాన్ని పొంది వారి కష్టనష్టాలలో పాలు పంచుకున్నప్పుడే నాయకునికి నిజమైన తృప్తి ఉంటుందని అన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, అఖిల్, దీప్‌సింగ్, శివ, జగన్, గురు, కరుణాకర్, ప్రశాంత్, అజయ్, సాంబ, చంటి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం : పుస్తె శ్రీకాంత్



సభ్యులు వద్ది రాజు రవిచంద్రను కలిసిన టిఆర్ఎస్ నాయకులు, మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

చార్మినార్, నవంబరు 8 ప్రభాతవార్త : పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు,పలువురు టిఆర్ఎస్ నాయకులు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను కలిసి శాలువ కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా పుస్తె శ్రీ కాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ పుట్ట పురుషోత్తం, మాజీ సర్పంచ్ కాశిరెడ్డి శ్రీను,టిఆర్ఎస్ నాయకులు పవన్ రెడ్డి, విష్ణు గౌడ్‌తో పాటు పలువురు మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 8, ప్రభాతవార్త : కార్తీక పౌర్ణమి పండుగను పురస్కరించుకుని వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ సంఘమిత్ర డిగ్రీ అండ్ కాలేజ్ విద్యాసంస్థల్లో కార్తిక దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానంద, సంఘమిత్రా విద్యాసంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొరదాల నరేష్ లావణ్య కాలేజ్ స్టాఫ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులతో దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భక్తి శ్రద్ధలతో దీపోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల యాజమాన్యంతో పాటు కాలేజ్‌ల ఫంక్షనల్ డీన్ మౌనిక, ప్రిన్సిపల్ బి.ఎన్.రాజేష్, మీరావలి, స్టూడెంట్స్ డీన్స్ రాజేశ్వరరావు, రాధికరెడ్డి, కాలేజీల పాకల్టీ బృందం తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుల మృతి పట్ల ప్రగాఢ సంతాపం

సైఫాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:ప్రముఖ పాత్రికేయులు కె.ఎల్.రెడ్డి, వరదాచారి మృతిపట్ల లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వర్ రావు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి ద్వారా సమాజంలో గొప్ప మార్పుల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. నూతన జర్నలిస్టులు వారిని ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. వారి రచనలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. వారి మృతి జర్నలిజానికి తీరని లోటని చెప్పారు.

## వైభవంగా కార్తీక మాసం మహోత్సవాలు

చార్మినార్, నవంబరు 8 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా సోమవారం రాత్రి చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో కార్తీక మాసం మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి.పాతబస్తీతో పాటు జంట నగరాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మందిరంలో పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం పూజలు జరిగిన అనంతరం మందిరంలో మహ అన్నకూట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చార్‌కమాన్ జెవెల్లర్స్ అండ్ షరాఫా అసోసియేషన్ ప్రతినిధులు అజయ్ కుమార్ అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా పాతబస్తీలోని ప్రాంతాలలో అన్నదాన కూట్ కార్యక్రమాలు జరిగాయి.

## అభివృద్ధి పథంలో షాబాద్

షాబాద్, నవంబర్ 8, ప్రభాతవార్త : రోజురోజుకు అభివృద్ధిపథంలో షాబాద్ మండలం ముం దుకెళ్తోందని జడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యాదయ్య, నరేందర్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామానికి వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి రూ.2కోట్లు, చర్లగూడ నుంచి మరియాపూర్ వరకు ఫార్మేషన్ రోడ్డు పనులకు రూ.40లక్షలు, అస్పల్లిగూడ స్టేజీ నుండి చర్లగూడ వరకు రీబీటీ నిర్మాణానికి రూ.36 లక్షలతో పనులకు జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ టీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో షాబాద్ మండలం రోజురోజుకు అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందన్నారు.

## ప్రతిఒక్కరికి ఉచిత న్యాయసేవలు అందాలి

**తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి**



సభలో ప్రసంగిస్తున్న గోవర్ధన్‌రెడ్డి, పాపిరెడ్డి, కుశ, రాధిక జైశ్వాల్, శైలజ

నాంపల్లి, నవంబరు 8 ప్రభాతవార్త : జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు 'హక్ హమారాభితో హై' పాన్ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి అధ్యక్షతన, మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు కాంప్లెక్స్‌లో మెట్రోపాలిటన్ మాడ్యుల్ మెగా లీగల్ సర్వీసెస్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాడ్యూల్ క్యాంప్‌ను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగిస్తూ ప్రతీఒక్కరికీ అందుబాటులో ఉచిత న్యాయసేవలు అందాలన్న ముఖ్యోద్దేశమే ఈ క్యాంప్ లక్ష్యమన్నారు. దీని గురించి తెలియని వారికి, సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఆశయంతో ఈ క్యాంప్ నిర్వహించడం జరిగిందని, ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ప్రముఖపాత్ర పోషిస్తున్నారని, దీన్ని ఇలాగే కొనసాగించాలని కోరారు. అలాగే వచ్చే శనివారం జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కూడా ప్రతీఒక్కరూ సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని, ఈ విషయంలో దీనిపై కూడా సంపూర్ణ అవగాహన కల్పించాలని గోవర్ధన్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెషన్స్ జడ్జి పాపిరెడ్డి, ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి కుశ, మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రాధిక జైశ్వాల్, అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్(క్రైమ్స్) హైదరాబాద్ ఎ.ఆర్.శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మహిళ, శిశు, వికలాంగులు, సీనియర్ సిటిజన్లశాఖ డైరెక్టర్ శైలజ, హైదరాబాద్ జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, లేబర్‌శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శిరీష, హైదరాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్/ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శైలజ, మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జస్పాల్‌సింగ్ తదితరులతో కలిసి మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ వారు డిపార్ట్‌మెంట్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్, డిసేబుల్డ్ అండ్ సీనియర్ సిటిజన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్; లేబర్ డిపార్ట్‌మెంట్ వారి సమన్వయంతో వాకింగ్‌స్టిక్స్, బ్యాటరీ వీల్‌ఛైర్స్, బ్యాటరీ ట్రైసైకిల్, కృత్రిమ కాళ్లు, కుట్టుమిషన్లు, ఈశ్రం కార్డులను ఎంపికచేసిన లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్ర మంలో పలువురు జ్యుడీషియల్ ఆఫీసర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయశాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE HONORABLE XXIV ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.S.No. 501 OF 2022**

**K. Rama Sharma & 4 Ors. ...Plaintiffs.**

AND

**1. Dy. Commissioner, GHMC**
**2. All Concerned. ...Defendants.**

This is to inform to the Genral Public that the above said Plaintiffs, Viz., **K. Rama Sharma & 4 Ors** who are the Legal Heirs of Late Sri Kakarlamudi Sitapathi Rao, the absolute owner of House bearing Municipal No.10-3-419, constructed on House Plot admeasuring 269.45 Square Yards situated at Mallepally, Hyderabad, Telangana has filed the present Suit No. OS. No. 501/2022 before the Honorable XXIV Addl. Chief Judge, Secunderabad seeking declaration as Legal Heirs of the above suit schedule property and the above OS is posted before this Honorable Court on 06.12.2022. And this Honorable Court has directed the Plaintiffs to issue a notice to "All concerned (D-2)" by way of paper publication. Hence, public at large are put to notice that if any person is having any objection to such claim of Plaintiffs to be declared as absolute owners of the suit property may file their objections/ counter along with the relevant documents in support of their claim/ objection at 10.30 am before the Honorable Addl. Chief Judge, Hyderabad on the next date of hearing i.e., on 06.12.2022, failing which the Court will proceed and pass necessary orders as prayed for.

By Order of Honorable XXIV Addl. Civil Judge, CCC, Hyderabad.

**Sd/- Durga Prasad Kotamraju, Advocate,**
Counsel for Plaintiffs,
# 12-13-879/1, Hanuman Nagar, Behind A P Diary, Tarnaka, Secunderabad-500017. Cell: **92465 47044**

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, RANGA REDDYDISTRICT AT' L.B.NAGAR**
**O.S.NO.1183 OF 2022**
**BETWEEN:**
1. Shahid Afrid Shaik S/o late shaik Mahaboob,age 19 Years, Occ: Student,
2. Afsha ahana Shaik D/o Late. Shaik Mahaboob, Aged about: 13 Years, Occ: Sudent, Both are R/o: plot.no.146, 1st floor, Srinivasa puram colony, Road.no.4, Karman ghat,Rangareddy Dist.palintiff No 2 is minor represent by Her natural brother

**...Petitioner/Plaintiffs**
**AND**
1.The Tahsildhar, Saroornagar Mandal, R.R. District
2. All concernAnd another
**...Petitioner/Plaintiffs**
**AND**
1.The Tahsildhar, Saroornagar Mandal, R.R. District
2. All concerned
**...Respondent/Defendants**

**PUBLIC NOTICE**

To
Whomsoever

Please take notice that the above Suit is filed for Declaring the plaintiffs as legal heir of late Mahaboob Pasha Shaik and the Mumtaj Begum Shaik against Tahsildhar, Saroornagar Mandal and all concerned. The same is posted for appearance on **18-11-2022 at 10:30 A.M.** If anybody have objections in above shall appear in person or through your counsel on the said date, the case will be heard and determined in your absence.

(BY THE ORDER OF THE COURT)
**BUCHI BABU .P**
Advocate
**Cell: 9848283353.**

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client **SRI. PEDDAGOUNI NARENDAR GOUD, S/o. PEDDAGOUNI KOMURAIAH GOUD** had lost his Original Link Registered Sale Deed,Dated 15.07.1996 bearing Document No.5875/1996 in respect of Plot No.30,admeasuring 200 sq.yds or 167.20 sq.yds in Sy.Nos. 79, 80, 102, 103 and 104 popularly known as Alkaapoor Township, situated at Neknampur Village, Rajendernagar Mandal, Ranga Reddy District and bounded on North: Plot No.31,South: 40 Feet Wide Road, East: Plot No.29 and West: 30 Feet Wide Road when hewas shifting the house at Puppalaguda Village, Gandipet Mandal. My client had alsoraised a complaint before Police about missing of document.If any person or persons finds the said Registered Sale Deed, Dated 15.07.1996bearing Document No.5875/1996 the same may be handed over to the undersignedas a law abiding citizen. Further, the above said original document shall not beabused or misused or otherwise utilized by unauthorized person. If any unauthorized person makes misuse of it, the same shall not bind my client.

**K.L.N.REDDY**
**G.HARINATH RAO**
**ADVOCATES.**
H.No.1113-23, Road No.1, Alkapuri Colony, Ramakrishnapuram, Hyderabad-500102.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE CUM ASSISTANT SESSION JUDGE:AT: MALKAJGIRI**
**OS.NO.442 OF 2021**
**BETWEEN:**
P. Avinash
**.... Plaintiff**
**AND**
K. Subadramma And others
**.... Defendants**

To
K. Subadramma W/o K. Anjaiah Aged About 61 years, Occ: House Wife, R/o H.No. 17-1-81, Edi Bazar, Hyderabad.
**.... Defendant No.1**

The Plaintiff has filed the above suit for Declaration And Recovery of Possession And Declaration Of Sale Deeds against you and the said matter is posted to **18.11.2022** for your appearance. You are therefore hereby directed to appear before this Hon'ble court on the above said date at **10.30 A.M.** either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.

// BY ORDER OF THE HONOURABLE COURT //
**Sd/-S. NAGESH REDDY**
ADVOCATE
Flat No. 101 & 102
#6-3-663/7/6
Jaffar Ali Bagh, Somajiguda,
Hyderabad - 500 082.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT : MALKAJGIRI**
**EP No.16 OF 2021**
**IN**
**Arb. Application No. 3 OF 2020**
**BETWEEN:**
Marru Madhusuddan Rao,
**...PETITIONER/DECREE HOLDER**
**AND**
M/s Panchayat Raj Teachers Cooperative Rep. By it's General Secretary
**...RESPONDENT/JUDGEMENT DEBTOR**

To,
M/s Panchayat Raj Teachers Cooperative Housing Society Limitd, TAB 218, Zilla Parishad Boys High School, Thirumala gherry, Secundrabad, Rep. By it's General Secretary

The petitioner have filed the above EP for Execution against you and the said matter is posted to **15.12.2022** for your appearance. You are therefore hereby directed to appear before the Principal District Judge, Medchal-Malkajgiri District, at Malkajgiri on the above said date at **10.30 A.M.** either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.

**SCHEDULED PROPERTY**
All that land admeasuring Ac 02-00 Gts (9680 Sq yards) of land in Sy no. 351 of Malkajgiri Village, Secundrabad and bounded as follows : NORTH : Land of the vendor , SOUTH : Land of Ahmadi Begum and Ors. EAST : Land of Ahmadi Begum and Ors. WEST : Land of Ahmadi Begum and Ors and at the North West corner, the land of Nippon Ikya Karmika Gruha Nirmana Sahakara Sangham

// BY ORDER OF THE HONOURABLE COURT //
**Sd/- S. NAGESH REDDY**
ADVOCATE
Flat No. 101 & 102,
Saai Priya Apartments,
Jaffar Ali Bagh, Somajiguda,
Hyderabad – 500082.

## మంత్రి కేటీఆర్‌తో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ బేటి



మంత్రి కేటిఆర్‌తో బేటి అయిన కార్పొరేటర్ గీత తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త :** రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కేటిఆర్‌తో మంగళవారం చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ బేటి అయ్యారు. ఇటీవల జరిగిన మునుగోడు ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి కె.ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించిన సందర్భంగా మంత్రి కేటిఆర్ తో బేటి అయి పలు అంశాలను చర్చించారు. మునుగోడు ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ విజయానికి చిలుకానగర్ డివిజన్ నేతలు ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, మహుమూద్,బాలు తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకామాయి పీఠంలో వైభవంగా ఈశ్వరాభిషేక పూజలు



పూజలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ లోని ప్రశాంతిహిల్స్‌లోనున్న శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో ఈశ్వరాభిషేకం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన రాజ్యసభ సభ్యుడు, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు, హెటీరో గ్రూపు సంస్థల ఛైర్మన్ బండి పార్థసారథి రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పీఠాధిపతి అనుగ్రహ భాషణం, ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.సూర్యనారాయణరెడ్డి, జమునారెడ్డి, రమేష్‌గౌడ్, లక్ష్మణాచారి, విజయసారథి, శ్రీనివాస్,రాధాకృష్ణ, అరవింద, లలిత్ సాయికుమార్, మాతాజీ విజయశ్రీ పాల్గొన్నారు.

## రూ. 30 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



లచ్చిరెడ్డిని సత్కరిస్తున్న సెల్ఫ్ ఫైనాన్స్ సంక్షేమ సంఘం సభ్యులు

**వనస్థలిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి 30 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించిన డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య దశలవారిగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీఅధ్యక్షులు వెంకట్‌రెడ్డి,కార్యదర్శి కృష్ణ, జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు రణధీర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో ఘనంగా కార్తీక పౌర్ణమి



మహిళలతో కార్తీక పౌర్ణమి పూజలు చేస్తున్న మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గ్రామంలోని పురాతన మహాదేవర శివాలయం లో అదేవిధంగా సాయినగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె శివలింగానికి మహిళలతో కలిసి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ బండారి మనోహర్ దంపతులు, పలువురు గ్రామస్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి : జిఎం ఆనంద్‌కుమార్



సమావేశంలో ప్రసంగిస్తున్న జిఎం ఆనంద్‌కుమార్ తదితరులు

**మలక్‌పేట, నవంబర్ 8 ప్రభాతవార్త :** శిక్షణా తరగతులను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ జిఎం ఆనంద్‌కుమార్, ఇడి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ లిమిటెడ్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫీల్డ్ టెక్నీషియన్స్, హోమ్ అప్లియన్స్ కోర్సులలో నిరుద్యోగులకు 60 రోజుల పాటు ఉచితశిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగింది. శిక్షణ ముగింపు కార్యక్రమానికి జిఎం ఆనంద్‌కుమార్, ఇడి డాక్టర్ రమేష్, ఎసిఎస్ టెక్నాలజీస్ నిర్వాహకులు ఓంకార్‌లు ముఖ్య అతిథిలుగా హాజరై ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆఫర్ లెటర్లను అందజేశారు. నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థద్వారా యువతకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు.

## గుడిసెవాసులకు ఎమ్మెల్సీ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 8 ప్రభాతవార్త :** అబ్దుల్లాపూర్ మెట్ సర్వేనెంబర్ 283లో వేసిన గుడిసెలను సందర్శించి గుడిసెలను పరిశీలించి గుడిసెలను బందోబస్తుగా వేసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ మీ గుడిసెల విషయంలో మద్దతుగా ఉంటానని, శాసనమండలిలో మాట్లాడి 60 గజాల స్థలం, ఇల్లు కట్టుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 3 లక్షల రూపాయలు ఇవ్వాలని మీ తరఫున పోరాటం చేస్తానమన్నారు. నిరుపేదలు 60 గజాల స్థలం కావాలని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే, రెవిన్యూ అధికారులు, పోలీస్ డిపార్ట్మెంట్ వాళ్లు కేసులు పెట్టడం సరైంది కాదని ఇది చట్ట వ్యతిరేకమైందని అన్నారు. ఈ స్థలంలో గతంలో ఇందిరమ్మ ఇండ్ల కింద లేఔట్ చేసే పట్టా సర్టిఫికెట్లు కూడా తయారుచేసి ప్రజలకు ఇవ్వలేదని ఇప్పటికైనా ఇట్టి స్థలాన్ని పేద ప్రజలకు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, గుండె శివకుమార్, కనకయ్య, ఇరుగు బిక్షపతి, గుండె సర్వయ్య, ప్రణయ్, కిరణ్, యాదయ్య, మందుల అనిత, భాగ్యలక్ష్మితోపాటు వందలాది మహిళలు ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతూ ర్యాలీగా బయలుదేరారు.

## హరిహరక్షేత్రంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

**మలక్‌పేట, నవంబర్ 8 ప్రభాతవార్త :** మలక్‌పేట పల్టాన్‌లోని హరిహరక్షేత్రంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ ఈ నెల 19వతేదీన గణపతి వార్షికోత్సవం, సాయంత్రం అభిషేకం, గణపతి హోమం, ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. అదే విధంగా 22వ తేదీ మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం, 23తేదీన శ్రీ ఉమామహేశ్వర స్వామి నిత్య ఏకవార అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇట రంగాచారి, అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, సభ్యులు సరాపు శ్రీహరి, రేణుఅగర్వాల్, మల్లికార్జున్, చంద్రశేఖరశర్మ, సత్యేందర్, విజయ్‌కుమార్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు చెక్కులు పంపిణీ : ఎమ్మెల్యే

**ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పలువురు లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని, అర్హులైన పేదలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రజనీకి రూ.60వేలు, పర్వతాలు రూ.60వేలు, రేఖకు రూ.60వేలు, నవనీతకు రూ.30వేలు, నిజాముద్దీన్‌కు రూ.24వేలు చెక్‌లు అందజేశారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు డా.బి.వి. చారి, పార్టీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, మస్కు సుధాకర్, జెసిబి రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో కనుల పండువగా ఆకాశ దీప పూజలు

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆకాశ దీప పూజలను ఘనంగా నిర్వహించారు.పర్వదినం సందర్భంగా శివ పార్వతుల ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించి జ్వాలా తోరణం జరిపారు. అదే విధంగా గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు లక్ష్మీ గణపతిరావు, శ్రీకాంతశర్మ, హయగ్రీవ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకట రమణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు..

**నేరెడ్‌మెట్, నవంబర్ 8 ప్రభాతవార్త:** కార్తీకమాసంలో శివుడికి ప్రత్యేక పూజలు చేస్తే శుభాలు కలగడమే కాకుండా ప్రజలుసుఖశాంతులతో ఉంటారని జరుగుతాయని శ్రీ సాయి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్దెల వెంకన్నగౌడ్, కార్యదర్శి బుగ్గ ఉపేందర్‌లు పేర్కొన్నారు. సోమవారం కార్తీకమాసం సందర్భంగా కాలనీలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. సాయంత్రం ఆకాశదీపం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో కాలనీసభ్యులు తాటి సుభాష్ గుప్తా, వెంకటేష్ శ్యామల, ధన్‌రాజ్, సోమేష్, శ్రీనివాస్, శ్రీశైలం, భక్తులు పాల్గొన్నారు.

## కోటీ దీపోత్సవంలో పూజలు చేసిన డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి



దీపోత్సవంలో పూజలు చేస్తున్న శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, నవంబర్ 8 ప్రభాతవార్త:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఎన్టీఆర్ స్టేడియంలో కన్నుల పండువగా నిర్వహించిన కోటీ దీపోత్సవంలో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తీక మాసంలో ఎంతో భక్తి శ్రద్దలతో నిత్యం దీపారాధన చేస్తుంటారని వారికి భగవంతుడి కటాక్షం ఉండి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

## కరాటే పోటీల్లో మౌంట్ కార్మెల్ విద్యార్థులు జయకేతనం



విజేతలకు సర్టిఫికెట్లు అందజేసిన కరాటే లెజెండ్ సుమన్

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో బడంగ్‌పేట్ మౌంట్ కార్మెల్ గ్లోబల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జయకేతనం ఎగుర వేశారు. ప్రతిష్ఠాత్మకంగాజరిగిన పోటీల్లో అండర్ 9 గ్రూపు డి నుండి కటాస్ విభాగంలో తుహిన సాయి బంగారు పతకాన్ని, అండర్ 8 గ్రూపు బినుండి హంసుజ సాయి, సంజన, హన్సికలు రజత పతకాలను సాధించారు. ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు, కరాటే లెజెండ్ సుమన్ బహుమతులు అందజేసి కోచ్ చందర్‌రావును అభినందించారు.

## ఎస్‌బిహెచ్ కాలనీలో బాక్స్‌డ్రెయిన్ పనులు ప్రారంభం



బాక్స్ డ్రెయిన్ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ ఎస్‌బిహెచ్ కాలనీలో కోటి రూపాయాల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బాక్స్ డ్రెయిన్ పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన నాలా కుంగిపోయి ధ్వంసం కావడంతో కొత్తగా బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాబోయే 50 సంవత్సరాల అవసరాలను తీర్చే విధంగా బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సుధీర్, శ్రీనివాస్, రఘు, కిషోర్, రాంప్రసాద్, సురేంద్రనాథ్, సుబ్బారావు పాల్గొన్నారు.

## అనాథగా మారి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



అనాథ శవం పాడె మోస్తున్న కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త:** అయినవాళ్ళు ఉన్నా అనాధగా మారి మతిస్థిమితం కోల్పోయి చివరకు బ్రెయిన్ స్ట్రోక్ గురై చికిత్స పొందుతూ మృతి చెందిన అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ కార్తీక్ దహన సంస్కారాలను అభాగ్యులను ఆదుకుంటున్న నాదర్‌గుల్ మాతృదేవోభవ ఆశ్రమం నిర్వహించింది. రోడ్లపై తిరుగుతున్న కార్తీక్‌ను మాతృదేవోభవ ఆశ్రమం చేరదీసిన సంగతి తెలిసిందే. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన అతడిని ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో స్పందించిన నాదర్‌గుల్ బిజెపి కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి అంత్యక్రియల నిమిత్తం డబ్బులు అందివ్వడమే కాకుండా ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరితో కలిసి మృతుడి పాడె మోశారు.

## కొత్తపేట బిజెఆర్‌భవన్‌లో 10న పింఛనర్ల సమావేశం

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త :** తెలంగాణ ఆల్ పెన్షనర్స్,రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా శాఖ ప్రథమ మహాసభలు ఈ నెల 10వ తేదీన కొత్తపేటలోకి బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల పదవీ విరమణ పొందిన ఉద్యోగుల హక్కుల సాధనకై 2008లో ఏర్పాటైన ఈ సంఘం రంగారెడ్డి జిల్లా మహాసభ జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరుగుతుందని, ఈ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సంఘం అధ్యక్షులు ఎం.ఎస్.రెడ్డి, కృష్ణమూర్తి, రంగయ్యలతో పాటు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు హాజరవుతున్నారని ప్రకటనలో పేర్కొన్నారు.10న ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రభుత్వ రంగ సంస్థల రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలని, పాత పింఛన్ విధానం కొనసాగించాలని తదితర అంశాలను సమావేశంలో చర్చించనున్నారు.

## క్షౌరవృత్తిలోకి రిలయన్స్ సంస్థ రాకుండా నిషేధించాలి



రిలయన్స్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న నాయిబ్రాహ్మణులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త :** క్షౌరవృత్తిలోకి పెట్టుబడి సంస్థలైన రిలయన్స్ రాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. చైతన్యపురి శివాజీచౌరస్తాలో మంగళవారం నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రిలయన్స్ సంస్థ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, షాపులు నడవక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రిలయన్స్ సంస్థ, అర్బన్ సంస్థలు నాయిబ్రాహ్మణులను ఆర్థిక మూలాలను దెబ్బతీసి రోడ్డు మీదికి తీసుకువస్తే వారి పరిస్థితి దయనీయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రిలయన్స్ అడ్డుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వృత్తిదారుల సమన్వయకర్త ఆశయ్య, గ్రేటర్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్, క్షౌర వృత్తిదారుల ప్రధానకార్యదర్శి చెన్నారం మల్లేష్, చైతన్యపురి డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, చందు, చింతల వెంకటేష్, గడల రాజు, మంకాల సుధాకర్ పాల్గొన్నారు.

## భగాయత్ కాలనీవాసులకు ఇంటి నెంబర్లు : ఎమ్మెల్యే బేతి



ఇంటి నెంబర్ల కేటాయింపుపై సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి, డిసి అరుణకుమారి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త :** రామంతాపూర్ భగాయత్ పరిధిలోని సాయికృష్ణకాలనీ, వెంకటసాయికాలనీ, కురుమ నగర్, సత్యనగర్, లక్ష్మినారాయణకాలనీ, సాబేరా కాలనీ, అన్నపూర్ణకాలనీ ప్రజలకు త్వరలో ఇంటి నెంబర్లు కేటాయించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం హబ్సిగూడ క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్, డిసి అరుణకుమారి, పలువురు కాలనీ సంఘం నేతలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భగాయత్ కాలనీలోని అన్ని ప్రాంతాల ప్రజలకు త్వరలోనే ఇంటి నెంబర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రజలు స్వంతంగా సెల్ఫ్ అసెస్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి నెంబర్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి రాజు, టిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, ఎం.డి.ముస్తాక్, జెసిబి రాజు, సూరం శంకర్, కాలనీ సంఘం నేతలు మహేశ్వర్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, నవంబరు 8 ప్రభాతవార్త:** పురాతన, చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లో కూలీకుతుబ్‌షాహీ పాలనలో హయత్‌భక్షీ బేగం మసీదు ఆవరణలో 400 సంవత్సరాల క్రితం నిర్మించిన గిర్కాబావి(హాతీబౌలి)శిథిలావస్థకు చేరింది. దాని చుట్టూ చెట్లు, చెత్తచెదారం పేరుకుపోయింది. మంగళవారం దానిని సందర్శించిన కార్పొరేటర్ సంబంధిత జీహెచ్ఎంసీ, హార్టీకల్చర్ అధికారులతో మాట్లాడి సిబ్బందితో బావి పరిసరాలను శుభ్రంచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు అంతస్థులలో నిర్మించిన ఈ బావిలో నీటిని తోడడానికి ఏనుగులను వినియోగించేవారని అందుకే హాతీ బావిగా(ఏనుగులబావి) పేరు వచ్చిందన్నారు. మసీదు పరిసరాలలో చెత్త, చెదారాలను బావిపరిసరాల లో వేయరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు నర్సింహారెడ్డి, జీహెచ్ఎంసీ, హార్టీకల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్తిక పౌర్ణమి సందర్భంగా అభిషేకాలు



శివుడికి పూజలు చేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 8 ప్రభాతవార్త :** కార్తీక పౌర్ణమి సందర్భంగా సరూర్‌నగర్ డాక్టర్స్‌కాలనీలో శ్రీ సూర్య రామాలయం ప్రాంగణంలో శివునికి కార్తీకపౌర్ణమి మంగళవారం ఏకదశ ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతునికి అర్చనలు నిర్వహించారు. ఫణిశర్మ వేదమంత్రాల మధ్య శివ అభిషేకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వక్కలంక శ్రీనివాస్‌రావు, వన్నడి శ్రీనివాస్, జనర్దన్‌రెడ్డి, ఆకారపు కృష్ణా, గజ్జలు ఆంజనేయులు శ్రీనివాస్‌రెడ్డిస్వామీ పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, మమత, సరిత, రమా, వాణి, సంధ్య పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులు కాపాడటంలో పాలక వర్గాల విఫలం : ఎఐటియుసి



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య తదితరులు

**తుర్కయంజాల్, నవంబర్ 8 ప్రభాతవార్త :** కార్మికుల హక్కులను కాపాడటంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఒరుగంటి యాదయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలో భరత్‌బాబు అధ్యక్షతన జరిగిన ఏఐటియుసి ప్రథమ మహాసభలకు ముఖ్య అతిదిగా యాదయ్య హాజరై మాట్లాడుతూ కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, గత 14 సంవత్సరాలనుండి రాష్ట్రంలో కనీస వేతనాల చట్టం మార్పుకు నోచుకోలేదన్నారు. ఈ కాలంలో నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. కార్మికుల జీతాలు పెరగకపోవడంతో వారి కుటుంబాల పోషణ చాలా కష్టంగా మారిందన్నారు. కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. మహాసభలకు ముందు యాదయ్య ఏఐటియుసి జెండాని ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు గువ్వల రాజు, గొరిగే నరసింహ, రాములు, శ్రీశైలం గౌడ్, దుబ్బ యాదయ్య, సుందరమ్మ, విజయ బుచ్చమ్మ కొట్యా నాయక్, దీప్లా నాయక్, చిన్న, బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఐటియుసి తుర్కయంజాల్‌మున్సిపాలిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గువ్వల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుబ్బ యాదయ్య, ఉపాధ్యక్షులుగా గొరిగే నరసింహ, సుందరమ్మ, సహాయ కార్యదర్శులుగా ఏ. రాములు, భాస్కర్, కోశాధికారిగా క్రాంతి కుమార్, కమిటీ సభ్యులుగా శ్రీశైలంగౌడ్, చిన్న, బుచ్చమ్మ, విజయ, దీప్లానాయక్, చెక్క యాదగిరి, బ్రహ్మయ్య, కొట్యా నాయక్, జనార్దన్, బోడిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 8 ప్రభాతవార్త:** కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మంగళవారం స్వామివారి పుష్కరిణి పూజ అనంతరం ప్రత్యేక సింధూర అభిషేకము, మంత్ర పుష్పము, హారతి నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ, దేవాలయ కమిటీ ఛైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, టిఆర్ఎస్ నాయకులు నల్ల రఘుమారెడ్డి, రాజిరెడ్డి, రోజారెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, దేవాలయ కమిటీ ధర్మకర్తలు సామ రంగారెడ్డి, బసిగూడెం జంగారెడ్డి, సిహెచ్ మల్లేష్‌గౌడ్, ఛాతిరి అఖిల సాగర్, మొరిశెట్టి శ్రీనివాస్, నర్రె శ్రీనివాస్, చలమల యాదిరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, సిహెచ్ అనిత, సిహెచ్ అశోక్ గౌడ్, ఇమ్మిడి జంగయ్య, సిరిపురం రాజు, పద్మాల శంకర్, దేవాలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌కు వినతి : లక్ష్మీప్రసన్న



మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న లక్ష్మిప్రసన్న తదితరులు

**వనస్థలిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీకార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మిప్రసన్నరామ్మోహన్ గౌడ్ మంత్రి కెటిఆర్‌ను ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎల్‌బినగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలలో గత దశాబ్దకాలంపైగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ సమస్యను జి.ఓ 118 విడుదల చేసి పరిష్కరించినందుకు లక్ష్మిప్రసన్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న త్రాగు నీటి పైప్ లైన్ల కొరకు, సామనగర్ నుండి సచివాలయనగర్ ఇండోర్ స్టేడియంవరకు యుజిడి ట్రంక్ లైన్ నిర్మాణంలో భాగంగా ఆంధ్రకేసరినగర్ కాలని నుండి సచివాలయ నగర్ ఇండోర్ స్టేడియంవరకు అసంపూర్తిగా మిగిలిపోయిన యుజిడి ట్రంక్ లైన్ ఏర్పాటు, కప్పరాయ చెరువు సుందరీకరణ, అదే విధంగా సామనగర్ నుండి సాహెబ్‌నగర్ సబ్ స్టేషన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఆమె మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన కేటీఆర్ త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో రంజిత్‌గౌడ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## క్షౌరవృత్తిలోకి రిలయన్స్‌ను రాకుండా ఐక్యంగా అడ్డుకోవాలి




ర్యాలీ నిర్వహిస్తున్న నాయిబ్రాహ్మణులు

**హయత్‌నగర్, నవంబరు 8 ప్రభాతవార్త:** క్షౌర వృత్తిలోకి కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడాన్ని నాయి బ్రాహ్మణులు సంఘటితంగా పోరాడాలని సంఘం హయత్‌నగర్ మండల కమిటీ అధ్యక్షుడు బంగారి కృష్ణయ్య, ప్రతినిధులు వంగూరి శ్రీనివాస్, కె.ఆనంద్ పిలుపునిచ్చారు. నాయిబ్రాహ్మణ క్షౌర వృత్తిలోకి రిలయన్స్ సంస్థ అడుగుపెట్టడాన్ని నిరసిస్తూ హయత్‌నగర్‌లో సంఘం ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థగా రిలయన్స్ చేతి వృత్తులు, చిన్నచిన్న వ్యాపార సంస్థలను నిర్వీర్యంచేస్తోందని తెలిపారు. చేతివృత్తులు చేసుకునే వారి జీవితాలను కార్పొరేట్ సంస్థలు రోడ్డు పడేసినట్లు తెలిపారు. ఇక కార్పొరేట్ సంస్థల దృష్టి నాయిబ్రాహ్మణుల క్షౌర వృత్తిపై పడిందని... నాయి బ్రాహ్మణులంతా ఐక్యంగా పోరాడి కార్పొరేట్ సంస్థలను అడ్డుకోవాలన్నారు. క్షౌరవృత్తి పరిరక్షణకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సి.హెచ్.సంతోష్, కుమార్, ఎస్.అశోక్, వి.సత్యం, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : కోమలి కృష్ణారెడ్డి



న్యూ హోప్ స్టాల్‌ను సందర్శించిన జడ్జి భూపతిరావు

**మలక్‌పేట, నవంబర్ 8 ప్రభాతవార్త :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మలక్‌పేట న్యూ హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి కోమలి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర న్యాయాధికార సేవా సంస్థ, రాష్ట్ర న్యాయాధికార సేవా సంస్థ, రంగారెడ్డి జిల్లా న్యాయాధికార సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత న్యాయసేవ అవగాహన సదస్సులో న్యూ హోప్ స్వచ్ఛంద సంస్థ మాదక ద్రవ్యాలు, మద్యపాన నిషేధంపై అవగాహన సదస్సులో స్టాల్‌ను ఏర్పాటుచేసారు. తమ సంస్థఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను రంగారెడ్డి జిల్లా సీనియర్ జడ్జి భూపతిరావు సందర్శించి అభినందించారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలతో పలు అనర్థాలు తలెత్తుతాయని వాటికి దూరంగా ఉండడంకోసం తమ సంస్థ ఉత్తమ చికిత్స, కౌన్సిలింగ్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడానికి పలు ప్రాంతాలలో అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు జోసఫ్, విజయలక్ష్మి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.